


# క్షీరసాగర మథనం

- నిర్మలాదిత్య

*(గత సంచిక తరువాయి)*

సెయింట్ పీట్, ఫ్లోరిడా

జులై, 2014

**పొద్దున్నే** 7.30 ఆఫీసుకు కమ్యూట్ చేస్తున్నప్పుడు, కార్ ఫోన్ మోగింది. డాక్టర్ వెంకటేసులు నుంచి ఫోన్.

ఆయన గొంతు హాలో అంటున్నప్పుడే కొంత ఆదుర్ద ఉందనిపించింది. "విశ్వం మీరు పంపించిన రిపోర్ట్ చూసాను. 16 స్పెసిమెన్లలో సగం పైనే కాన్సర్ సూచనలు చూపెడుతున్నాయి. మీరు వెంటనే అక్కడి డాక్టర్లను సంప్రదించి ఆపరేషన్ లేక రేడియేషన్ మొదలు పెట్టాలి", అన్నాడు ఆందోళనగా.

"గ్లీ సాన్ స్కోర్ 3+4 కదా. అంత తొందర పడాల్సిన పనిలేదేమో", అన్నాడు విశ్వం.

"ఎప్పుడు మిగిలిన అవయవాలకు ఈ కాన్సర్ వ్యాపిస్తుందో మనకు తెలియదు. అలా వ్యాపించిన తరువాత రేడియేషన్, కీమో నే మార్గం. సర్జరీ పనికి రాదు. నా మాట విని వెంటనే డాక్టర్ సంప్రతించి ఆపరేషన్ ఫిక్స్ చేసేసుకోండి", అని చెప్పాడు డాక్టర్ వెంకటేసులు.

సరే నని ఫోన్ పెట్టేసిన వెంటనే, ఒక్కసారి నిరాశ, నిస్పృహలతో కూడిన వాతావరణం విశ్వం మనస్సులో నిండిపోయింది.

పెద్ద నాన్న వాళ్ళబ్బాయి శివ గుర్తుకొచ్చాడు. ఓ ఆరు నెలల ముందే శివ ప్రోస్టేట్ సర్జరీ అయ్యిన వెంటనే ఫోన్ చేసాడు. అప్పుడు బాగానే ఉన్నాడు బాగా మాట్లాడాడు. శివకు ఫోన్ చేస్తే శివ వాళ్ళబ్బాయి ఎత్తుకున్నాడు. ఆపరేషన్ చేసిన తరువాత కాన్సర్ ఎముకలకు కూడా పాకింది అని తెలిసిందని చెప్పి, రేడియేషన్, కీమో రెండు చేశారని, అయినా లాభం లేక పోయిందని. గత వారమే శివ శివసాయుజ్యం అయ్యాడని ఏడుస్తూ చావు కబురు పంచుకున్నాడు.

"మరి ఆ విషయం నాకెందుకు చెప్పలేదు", కొంత నిష్టూరంగానే అడిగాడు విశ్వం.

"లేదంకుల్. మీ కూ ప్రోస్టేట్ సమస్య ఉందని తెలిసింది. నేను ఈ అంత్యక్రియల గోడవలలో పడిపోయాను. మీ ఆరోగ్యం జాగ్రత్త", అంటూ ఫోన్ పెట్టేసాడు.

శివ చనిపోవడం పెద్ద షాక్ అని ఆఫీసు చేరిన తరువాత కానీ తెలీలేదు, విశ్వంకు. దారిలో పోతున్న కార్లు, రోడ్డుకు రెండు వైపులున్న గడ్డి, రోడ్డు గుర్తులు, ఆఫీసు ఆవరణలో అందంగా లాండ్స్కేప్ చేసిన గార్డెన్, విపరీతంగా పెరిగి ఓక్ చెట్లకు వేలాడుతున్న బూజు లాగా ఉన్న స్పానిష్ మాస్, ఇవేవీ ఇంక కొన్ని నెలల తరువాత చూడలేనా? సీత నేను లేకుండా పనులన్నీ మేనేజ్ చేస్కో గలదా? లక్ష్మి సంగతేమిటి?, అంతులేని ఈ ఆలోచనలన్నీ ఆపడం విశ్వానికి సాధ్య పడటం లేదు.

ఆఫీస్ చేరిన వెంటనే సీత కు కూడా డాక్టర్ వెంకటేసులు చెప్పింది, శివ వాళ్ళబ్బాయి చెప్పింది చెప్పేసాడు, విశ్వం. సీతకు కూడా శివ పోవడం బాధనే అనిపించినా, విశ్వంకు ధైర్యమే చెప్పడానికి ప్రయత్నిం చింది. కాని సీత గొంతులో జీర మాత్రం కప్పి పుచ్చడం, కష్టమే అయ్యింది.

ఇక్కడ మంచి ఆరోగ్య వసతులున్నాయి. ప్రపంచంలో నలుమూలల నుంచి చికిత్స కోసం ఈ దేశానికి వస్తారు. నేను మరీ ఎక్కువగా నా ఊహా లోకంలోకి వెళ్లి అనవసరంగా బాధ పడుతున్నానేమో అని, ఆఫీసు విషయాల పై మనస్సు పెట్టి పనిచేయడానికి ప్రయత్నం చేయ సాగాడు విశ్వం.

రాబర్ట్ గుర్తుకు వచ్చాడు. పిరమిడ్ గ్రూప్ పని అయ్యిపోయింది అని బెత్ చెప్పినా, విశ్వం మనస్సు దానికి రాజీ పడలేదు.

"బాబ్ నీడ్ ఆ ఫేవర్ బడ్డీ", విశ్వం రాబర్ట్ ను అడిగాడు.

"టెల్ మీ. వాట్ కేన్ ఐ డు?", అన్నాడు రాబర్ట్.

"మొన్న వేగస్ పోయాను. తెలుసు కదా. పిరమిడ్ గ్రూప్ వాళ్ళ హోటల్ రెడ్ రాక్, స్ట్రిప్ పక్కనున్న సందులో ఉంది. సగం పైన స్లోట్ మాషీన్లు పని చేయకుండా రిపేర్ లో ఉన్నాయి. అలానే పిరమిడ్ గ్రూపులోనే ఉన్న మయామీ రియాల్టీ కంపెనీ ఈ మధ్య కొన్ని లక్జరీ అపార్టుమెంట్లు , ఇండ్లు మార్కెట్ ధర కంటే చాలా ఎక్కువ ధరలకి అమ్మిందని, న్యూస్ లో వచ్చింది. వీటన్నిటికీ ఏదో సంబంధం ఉంది అని నా కనిపిస్తుంది. పిరమిడ్ గ్రూప్ లోని కంపనీల అకౌంట్లు అన్నీ పరిశీలించి, నాకు నీ అభిప్రాయం చెబుతావా?", అని అడిగాడు విశ్వం.

"బెత్ విల్ గివ్ యు ఎ హార్డ్ టైం", అని నవ్వాడు రాబర్ట్," కానీ నీ ఆలోచన నాకు నచ్చింది. లెట్ స్ ఫాలో ది మనీ ట్రయిల్. రెడ్ రాక్ ప్రతీ రోజు మన బ్యాంక్ లో క్యాష్ జమ చేస్తుంది. మరి రెడ్ రాక్ లో సగం మెషీన్లు పని చేయక పోతే,

అంత క్యాష్ ఎక్కడ నుంచి వస్తున్నది. ఎదో ఫిషీ గానే ఉంది. కానీ నేను నీకు ఈ పని చేస్తున్నా అని ఎవరికి చెప్పకు విశ్వం", అని చెప్పి పెట్టేసాడు.

విశ్వం ఆ రోజు పరిశీలనకు బెత్ పంపిన కొత్త అకౌంట్ల లిస్ట్ లో నుంచి ఓ అకౌంట్ నెంబర్ తీసుకొని, రొటీన్ గా పనిలో పడిపోయాడు.

– 16 –

1998

ఎలక్షన్ కమిషన్ ప్రకటన – ఫిబ్రవరి 16 నుండి సాధారణ ఎన్నికలు మొదలు

మహేష్ ఢిల్లీ లో అశోక హోటల్ లో బుక్ చేసాడు. బయప్ప రెడ్డి ఇల్లు తుగ్లక్ రోడ్ లో ఉంది. హోటల్ నుండి ఓ 4 కిలోమీటర్లే. ఆ రోడ్డు లో ఉన్న ఇండ్లన్నీ కేంద్ర ప్రభుత్వం మంత్రులకే కేటాయించింది. పొద్దున్న 8 గంటలకే మీటింగ్ ఉండటం తో పి.ఎల్. మహేష్ లు ముందు రోజే రాత్రి ఫ్లైట్ లో చెన్నై నుండి డిల్లీకి చేరారు. మంత్రిని కలిసిన తరువాత పి.ఎల్ చెన్నై కి వెళ్లిపోవడానికి మహేష్ ఏర్పాట్లు చేశారు. మహేష్ కు సౌత్ బ్లాక్ మంత్రి వర్గ కార్యాలయాలలో కొంత పని ఉంది. కొత్త కంపెనీ కని విదేశీ కెమికల్స్ కంపనీ తో ఏర్పరచుకున్న ఒప్పందం ప్రభత్వం ఇంకా ఆమోదించలేదు. అది బయప్ప రెడ్డి కార్యాలయంలోనే పెండింగ్ లో ఉంది. గత కొద్ది నెలలుగా బయప్ప రెడ్డి దగ్గర అనుకున్నంత వేగంగా పనులు జరగటం లేదు. ఎలక్షన్స్ రాబోతున్నాయి కాబట్టి, ఆ వైఖరి మారుతుందని పి.ఎల్. నమ్మకం.

పి.ఎల్, మహేష్ లు బయప్ప రెడ్డి ఇంటికి ఓ పావు గంట ముందే చేరారు. బయప్ప రెడ్డి పర్సొనల్ సెక్రటరీ నాయర్ వాళ్ళని లోపలికి తీసుకెళ్లాడు. బయప్ప రెడ్డి పొద్దున బ్రేక్ఫాస్ట్ చేస్తున్నాడు.

"రండి, రండి ఎలా ఉన్నారు పి.ఎల్. నేనే మీకు కబురు పెట్టాలనుకున్నాను, మీరే వచ్చారు. సంతోషం. నాయర్ నాకు ఇప్పుడే చెప్పాడు. కూర్చోండి", అన్నాడు బయప్ప రెడ్డి. అతని కను సంజ్ఞలర్ధం చేసుకున్నట్లు, పిల్.ఎల్.కూర్చోగానే ఇడ్లీ, వడలతో ఓ ప్లేట్ ప్రత్యక్షమైంది. టేబిల్ మీద, పచ్చడి, సాంబార్లతో పాటు బ్రెడ్ టోస్ట్, జామ్, సాస్ సీసాలు కూడా ఉన్నాయి.

"నాయర్ వీళ్లకు కావలసినది చూడు", అంటూ బయప్ప రెడ్డి మహేష్ ను, నాయర్ ను బయటకు పంపించేశాడు.

"బాగానే ఉన్నాను రెడ్డి గారు, మీ దయ వల్ల. అదే ఓ కొత్త కెమికల్స్ ఫ్యాక్టరి పెడుతున్నాము. మీ ఆశీర్వాదం కావాలి", అన్నాడు పి.ఎల్. ఇడ్లీ ముక్క తుంచుతూ. పెద్ద తినాలని లేదు. అలా అని వద్దని చెప్పబుద్ధి కాలేదు.

"ఆ ఫ్యాక్టరీ గొడవలు మా నాయర్ కు వదిలేయి. నేనుండగా, నీకు ఏమి అడ్డంకులు ఉండవు. నేను నిన్ను పిలవాలనుకోవడాని కారణం చెప్తా. ఎలక్షన్స్ త్వరలోనే ఉన్నాయి కదా. ఈ సారి ప్రతి ప్రతిపక్ష్యాలు ఎర్రా సామి ని నాకు ప్రత్యర్థి గా నిలబెట్టారు. ఎర్రా సామి నీకు తెలుగు కదా, మా నియోజక వర్గం సారా కాంట్రాక్టులు అన్నీ అతని కైవసమే. అతని కెదురు గా ప్రభత్వ వేలంలో పాడాలంటే, ఎవరికైనా ఉత్సలే. మొదట్లో తెలీక పాడిన ఒకరిద్దరిని, పట్టపగలే దారుణంగా చంపించేశాడు. సారా వ్యాపారం కదా, చేతిలో మొత్తం క్యాష్ ఆడుతూ ఉంటుంది. ఇది వరకు ఎలెక్షన్లకు డబ్బులు కావాలంటే, అతని దగ్గరే పోయే వారం. అతను ఏ మాత్రం సంకోచించకుండా డబ్బు పంపించే వాడు. ఈ సారి నీ మీద ఆధార పడుతున్నాను", అన్నాడు బయప్ప రెడ్డి.

పి.ఎల్ కు విషయం అర్ధం అయ్యిపోయింది. తన పని కూడా అయ్యిపోతుంది అని నమ్మకం వచ్చేసింది.

"దానికేముంది రెడ్డి గారు, మీకెంత కావాలో చెప్పండి, నేను ఏర్పాటు చేస్తాను. కొంచెం సమయం పడుతుందేమో. డబ్బులు విదేశాల్లో ఉన్నాయి. ఇక్కడికి తెప్పించడానికి కొంత సమయం పడుతుంది", అన్నాడు పి.ఎల్.

"దానికి సమయం ఎందుకు? ఎర్రా సామి తో మాట్లాడు. అతను సారా వ్యాపారంతో బాటు డ్రగ్స్ వ్యాపారం చేస్తాడని విన్నాను. అంతా క్యాష్ వ్యాపారమే. వాళ్ళకి ఫారిన్ సారాయి బుడ్లు, డ్రగ్స్ కావాలంటే డాలర్స్ కావాలి. అది నువ్వు విదేశాలలో ఒప్పందం కుదుర్చుకుని, ఎర్రసామికి డాలర్లు పంపిస్తే, అతను ఇక్కడ నీకు రూపాయలు అందజేస్తాడు. హవాలా మార్కెట్ లో కూడా ఎర్రా సామి చేయి ఉంది", అన్నాడు బయప్ప రెడ్డి.

"ఎర్ర సామి, మీ ప్రత్యర్థి కదా?", పి.ఎల్. అనుమానం వ్యక్త పరిచాడు.

"దానికదే, దీనికిదే", నవ్వుతూ చెప్పాడు బయ్యప్ప రెడ్డి.

అలానే ఓ అర గంట మాట్లాడి, పి.ఎల్.మళ్లీ కలుస్తాను అని బయప్ప రెడ్డి దగ్గర సెలవు తీసికొన్నాడు.

గది దాటి బయటకు రాగానే మహేష్, నాయర్లు ఎదురొచ్చారు.

నాయర్తో మాటలు ముగిసినట్లు, పని కూడా ఓ కొలిక్కి వచ్చినట్లు మహేష్ ముఖంలో తెలిసిపోయింది, పి.ఎల్ కు.

బయట కార్లో కూర్చున్న తరువాత పి.ఎల్. బయప్ప రెడ్డి కోరికలు, మహేష్ కు చెప్పాడు. హవాల ఎర్రా సామి తో చేయమంటాడు, ఎర్రా సామి డ్రగ్ వ్యాపారానికి దూరంగా ఉండడం మంచిందని తన అభిప్రాయాన్ని కూడా చెప్పాడు.

మహేష్ "సార్, నాయర్ కూడా నాకు అదే చెప్పాడు. డబ్బు హవాలా ద్వారా తెప్పించ వచ్చు. కానీ మాసిలా మణి ద్వారానే తెప్పిస్తాను. మీరన్నది సరినే. మాసిలా మణి కి ఎర్రా సామి కి చాలా వ్యత్యాసముంది", అన్నాడు మహేష్

మహేష్ మాటలకు పి.ఎల్. నవ్వి, "మనం చేసే పని సరి కాదు. కాని అందులోనూ నీతి వెదుక్కోవడం విచిత్రం", అన్నాడు.

మహేష కు వెంటనే పి.ఎల్. మాటలు అర్ధం కాలేదు.

"నాకు తెలిసినంతవరకు, మీరు మీ వ్యాపారం అతి కొద్ది వ్యవధి లోనే ఆకాశం హద్దులకి తీసుకెళ్తూ, మీ చుట్టూ ఉన్న వారికి కూడా మీ భాగ్యం లో, ఓ భాగం ఇచ్చారు. మీ కంపెనీలలో పని చేయాలని పోటీ పడే ఐ ఐ ఎం విద్యార్ధులు, మీ కంపెనీ షేర్లు, సంస్థలతో పోటీ పడి కొనే సామాన్య జనాలు, మీరు స్వచ్ఛంద సంస్థలకిచ్చే విరాళాలు ...ఇంకా ఏమి కావాలి నిదర్శనాలు", మహేష్ ఉద్వేగంగానే అన్నాడు. మహేష్ తాను మామూలు అకౌంటెంట్ నుంచి ఇవ్వాళ ఇంత పెద్ద పేరున్న పి.ఏల్ గ్రూప్ సంస్థలకి సి.ఎఫ్.ఓ, పి.ఎల్ కు కుడి భుజంగా పని చేయడం కూడా ఓ సినిమా రీల్ లాగా కనిపించింది.

పి.ఎల్. మళ్ళీ నవ్వాడు.

మహేష్ ముఖంలో ఇంకా ఏదో చెప్పాలనే తపన కనిపించింది పి.ఎల్. కు.

"సార్, ఆ కెమికల్స్ ప్రాజెక్ట్ ఆమోదానికి ఆ కొరియన్ కంపెనీ వాళ్ళు కూడా ఏదో ముట్టజెప్పారట. ఆ డబ్బు మన దేశం తెప్పించడానికి మార్గం గురించి అడిగితే, నాయర్ ను కలవడానికి వచ్చిన అగర్వాల్ ను పరిచయం చేసారు. మీరు 'టార్గెట్ కన్సల్టెంట్స్' గురించి వినే ఉంటారు. దాని అధినేత. ఎక్కువ డిఫెన్స్ కాంట్రాక్ట్ ల పైన పని చేస్తారు. అగర్వాల్ చెప్పిన ప్రకారం, మనం కొరియన్ కంపెనీకి చెప్పి, బయప్ప రెడ్డి రావలసిన డబ్బు మన స్విస్ అకౌంట్లో జమ చేయాలి ముందు. తరువాత మారిషస్ లో ఓ కంపనీ వివరాలు అగర్వాల్ మనకు అంద జేస్తాడట. మనం ఆ డబ్బును మారిషస్ కంపెనీ కి పంపించాలట. ఆ మారిషస్ కంపెనీ బయప్ప రెడ్డి మొన్ననే ఆరంభించిన గ్రానైట్ కంపెనీ షేర్లు కొనడానికి డబ్బు బ్యాంక్ ద్వారా పంపిస్తుందట", అన్నాడు మహేష్.

విషయం వెంటనే అర్ధం అయ్యిపోయింది, పి.ఎల్. కు. గట్టిగా నవ్వి, 'మారిషస్ కంపనీ వివరాలు అందిన తరువాత ఆ కంపనీ ఎవరిదని వాకాబు చేసి చూడు. నీకు జవాబు దొరకదు. అది వదిలేయి. ముందు మన జాగ్రత్త మనం చూసుకోవాలి. మారిషస్ కంపెనీ కి డబ్బులు పంపిస్తే మన పని అయ్యిపోతుందని, నాయర్ కు పదే, పదే చెప్పు. మారిషస్ కంపనీ నుండి ఇండియా కి డబ్బులు తెప్పించే పని ఆ అగర్వాల్ భాద్యతనే. మనకు సంబంధం లేదు", అన్నాడు.

మహేష్ అర్థం అయ్యినట్లు తలా ఊపి,"సార్ ఆ పని నేను చూసుకుంటాను లెండి. మీరు చెన్నై వెళ్లిపోండి. నేను సౌత్ బ్లాక్ లో ని చూసుకొని రిటర్న్ అవ్వుతాను", అన్నాడు.

– 17 –

సెయింట్ పీట్, ఫ్లోరిడా

ఆగస్టు, 2014

విశ్వం కాఫీ తీసుకోవడానికి లేచి బ్రేక్ రూమ్ వైపు నడవసాగాడు. దారిలో ఎదురుగా వస్తున్న కొందరు నవ్వుతో హలో అంటున్నారు. పరిచయం లేని వాళ్లు యాంత్రికంగా, తమ ఆలోచన ప్రపంచంలోనుంచే పలుకరిస్తున్నారు. విశ్వం కు ఎందుకో ఇది ఓ తాత్కాలికమేన, అని ఎక్కువగా అనిపించ సాగింది. ఆపరేషన్ చేసుకోవాల్సినట్లే ఉంది. ఎన్ని ప్రయ^త్నాలు చేసినా, ఈ కాన్సర్ ను జయించగలనా, అన్న అనుమానం పీడించ సాగింది. ఎందుకో దిన కాంతి కొంచెం వెల వెల పోయిందనిపించింది. స్వతహాగా ఆశావాది కావడం వల్ల, ఈ మూడ్, ఆలోచన సరళి విశ్వంకు నచ్చలేదు. అదే అంతస్తులో ఉన్న బ్రేక్ రూమ్ కు పోదాననుకున్న విశ్వం, లిఫ్ట్ దగ్గర ఆగి 2 అంతస్తులు దిగి, కెఫెటేరియ వైపు దారి తీసాడు. అక్కడ స్టార్ బక్స్ కాఫీ తాగాలనిపించింది. కాఫీ తీసుకొని కెఫెటేరియ బయట ఉన్న లాన్ లో వేసిన కొన్ని టేబిల్స్ , కుర్చీల వైపు వెళ్లి ఓ కూర్చిలో కూర్చున్నాడు విశ్వం. ఆ కుర్చీ ఎన్నుకోవడానికి కారణం అది ఓ ఫౌంటెన్ ఎదురుగా ఉండటమే. ఫౌంటెన్ లో నుంచి పడి ప్రవహిస్తున్న నీళ్ల చప్పుడు, విశ్వం కు ఓ ప్రశాంతత కలిగించడం, ఇది వరకే అనుభవించడం వల్ల, ఆ కుర్చీ ఎన్నుకోవడంలో ఆశ్చర్యం ఏమి లేదు. ఫోన్ మోగితే చూసాడు. లక్షి నుండి.

"బంగారం, బాగున్నావామ్మ. ఏంటి పొద్దున్నే చేసావు?", అన్నాడు విశ్వం.

"సైబర్ హ్యాకింగ్ పోటీలో ప్రైజ్ వచ్చింది నాన్న", అంది లక్షి .

"కంగ్రాట్స్ బంగారం. నీకొస్తుందని ముందే ఊహించాను", సంతోషంగా అన్నాడు విశ్వం.

"దానితో పాటు పాలో ఆల్టో కంపెనీ నుండి చదువు అయ్యినా తరువాత ఉద్యోగం ఆఫర్ వచ్చింది నాన్న. మంచి ఆఫర్. అనుకోలేదు", అంది లక్షి

" మళ్లీ కంగ్రాట్స్ తల్లి. మంచి విషయమే కదా. ఇంత తొందరగా నీకు జాబ్ ఆఫర్ రావడం గొప్ప విషయమే కదా", లక్షి గొంతులో ఉన్న సంశయం కని పెట్టిన విశ్వం.

"లేదు నాన్న. నాకు ఈ కెరీర్ ఉద్యోగాలు ఇష్టం లేదు. ఒకరి కింద పని చేయడం ఇష్టం లేదు. నేను ఓ కంప్యూటర్ సెక్యురిటి కంపెనీ మొదలు పెడతామన్న ఆలోచనలో ఉన్నాను", అంది లక్షి , విశ్వం అడ్డంకును ఎదురు చూస్తూ.

రెండు సమస్యలు. నిజమే విశ్వం కు లక్షి అనుకున్న పనులు రెండూ నచ్చలేదు. మొదట చేతికి వచ్చిన ఇంత మంచి ఉద్యోగం కాలదన్నడం. రెండోది ఏమౌతుందో తెలియని ఈ కొత్త కంపనీ పెట్టాలనుకోవడం. కానీ ఇలాంటి సంభాషణలు ఇది వరకే చాలా జరిగినందువల్ల విశ్వం కు ఈ సంభాషణలో గెలవడం కష్టమని తెలుసు. దానికి తోడు, ఈ కాన్సర్ సమస్య వచ్చినప్పట్లుండి, తనకు, ఇలాంటి సభాషణల లో పాల్గొని, గెలవాలనుకోవడంలో ఆసక్తి పూర్తిగా పోయింది.

"సరే నమ్మా. నీ కేది ఇష్టమైతే, అదే చేయి. నేను మళ్ళీ పనిలో పడాలి", అని లక్షి దగ్గర వీడ్కోలు తీసుకున్నాడు విశ్వం. లక్షి , విశ్వంలో వచ్చిన ఈ మార్పు చూసి, విస్మయం చెందింది. ఏదో నాకు అంతు బట్టని మార్పు నాన్నలో వచ్చింది అని అనుకుంది.

పనికి తిరిగి వెళ్తున్న విశ్వం, దారిలో ట్రాష్ బిన్ లో కాఫీ కప్పులు పడేసి ఫోన్ వైబ్రేట్ అయ్యితే తీసి చూసాడు. , సీత దగ్గర నుండి టెక్స్ట్. మధ్యాహ్నం MRI కి తను కూడా రావాలా అని ఓ ప్రశ్న. రావలసిన అవసరం లేదని సీత కు చెప్పాడు విశ్వం. కానీ తాను ఎలా వస్తుందని తెలుసు.

కంప్యూటర్ చెక్ చేస్తే, అప్పటికే 4 మెసేజీలు బెత్ నుండి ఉన్నాయి. బెత్ కు ఏదో తెలిసిన విషయం పైనే కంగారు. విశ్వం ఆ ప్రశ్నలకు సమాధానం చెప్పి మళ్లీ రోటీన్లో పడిపోయాడు.

మధ్యాహ్నం 2.30 కు పని ఆపేసి తను తిరిగి వస్తానని చెప్పి ఆఫీస్ నుండి హాస్పిటల్ వైపు దాటి తీసాడు.హాస్పిటల్ గేట్ దగ్గిరే విశ్వం కు సీత ఎదురొచ్చింది.

ఎం ఆర్ ఐ రూమ్ రెండో ఫ్లోర్ లో ఉంది. అప్పటికే ఓ ఇద్దరు ఎం ఆర్ ఐ కోసం వేచి ఇన్నారు. విశ్వం ను ఓ 15 నిమిషాల తరువాత లోపలికి పిల్చారు. గౌన్లోకి మారిన తరువాత ఎం ఆర్ ఐ మెషీన్ ఉన్న మరో రూముకు తీసికెళ్లారు. సీత విశ్వం బట్టలు ఓ పేపర్ బ్యాగులో వేసుకొని వెయిటింగ్ రూమ్ వైపు, హాస్పిటల్ సిబ్బంది దారి చూపు తుండగా, అడుగులేసింది.

విశ్వంకు తన తండ్రి కూడ ఎం ఆర్ ఐ టెస్ట్ అప్పుడు భయపడటం గుర్తు వచ్చింది. ఎం ఆర్ ఐ ఓ పెద్ద మెషీన్. దానికి మధ్యలో ఓ డ్రమ్ము సైజ్ ఓపెనింగ్, దానిలోకి పంపించడానికి, బయటకు లాగడానికి ఓ జారుడు బెడ్. విశ్వం బెడ్ మీద పడుకో బెట్టి, అది వరకే ఐ వి ఫీడ్ కని చేతికి పెట్టిన ట్యూబ్ కి ఐ వి ఫీడ్ జోడించి, సెలైన్, మందులు పంపించ

సాగారు. ప్రోస్టేట్ ఇమేజి లనేమో, మళ్ళీ కింద నుంచి కోలన్ లోకి ఒక ప్రోబ్ పెట్టారు. ఐ వి ఫీడ్ పూర్తి అయ్యాక, మెషీన్ లోకి బెడ్ తోసారు.

కళ్ళు తెరిస్తే కొన్ని ఇంచిల పైనే ఎం ఆర్ ఐ మెషీన్. ఏమైనా సమస్య అనిపిస్తే పిలవమని, ఓ ఎర్ర బటన్ ఉన్న వైరు చేతికి అంద జేశాడు డాక్టర్. టెస్ట్ అప్పుడు కేవలం పేషెంట్ మాత్రమే ఉండాలి అంటూ ఆ రూమ్ బయటకు అందరూ వెళ్లిపోయారు. వెళ్లిపోయిన తరువాత విశ్వంకు ఎం ఆర్ ఐ ఓ నరకంలానే అనిపించింది. అటూ ఇటూ కదల లేదు. సమ్మెట వేస్తున్నట్లు టప్, టోంగ్ అంటూ ఒకటే శబ్దాలు. పరీక్ష 45 నిమిషాలే అయ్యినా, కొన్ని గంటలు లాగా అనిపించింది విశ్వం కు. తనున్న బెడ్ బయటకు లాగి, ప్రోబ్ కిందనుండి లాగి బయటకు తీసి, ఎలా అనిపించింది ఈ టెస్ట్ అని అడిగారు విశ్వంను డాక్టర్. విశ్వం చెప్పిన అనుభవం విని డాక్టర్, నవ్వుతూ మీకు ఇరుకు గదులు ప్రదేశాలు పడేటట్టు లేవు. క్లాస్ట్రోఫోబిక్ లాగా అనిపిస్తుంది. నెక్స్ట్ టైం ఈ సమస్య చెప్పండి. మీకు సెలైన్ లో మందుల తో పాటు రిలాక్స్ అవ్వడానికి మైల్డ్ అనస్తేసియా లాంటి మందు ఇచ్చేస్తాం అంటూ నవ్వాడు డాక్టర్.

రిపోర్ట్ గురించి వాకబు చేస్తే, మరో మూడు రోజులు పడుతుందని చెప్పారు. రిపోర్ట్ అందిన వెంటనే, తనను రెఫెర్ చేసిన సర్జన్ ఆఫీసు నుంచే ఫోన్ వస్తుందని చెప్పారు.

బెడ్ దిగి MRI రూమ్ బయటకు వస్తూనే విశ్వంకు ఆందోళన, సంతోషం కలసిన సీత ముఖం కన పడింది.

ఓ నిమిషం నేనెంత అదృష్టవంతున్ని అనుకున్నాడు విశ్వం.

– 18 –

2000

సమాచార, సాంకేతిక చట్టం(ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఆక్ట్) కు శాసన సభ ఆమోదం. సైబర్ క్రైమ్, ఎలెక్ట్రానిక్ వ్యాపారాల నియంత్రణ, చట్ట ముఖ్యోద్దేశ్యం.

పి.ఎల్ గ్రూప్ కంపెనీల లీగల్ డిపార్ట్మెంట్ కు అధినేత మీర్చందాని. ప్రభుత్వం నుంచి వచ్చిన షో కాస్ నోటీస్ దానికి సమాధానంగా చేయ వలసిన పనులు, చేయక పోతే కలిగే నష్టాల గురించి పి.ఎల్ కు వివరిస్తున్నాడు. పి.ఎల్. గ్రూప్ మొదట్లో ప్రారంభిన క్రోమేట్ ఫేక్టరీ కి సంబంధించిన నోటీస్ అది. ఆ కాలంలో తోలు పరిశ్రమలో క్రోమ్ టానింగ్ చేసినప్పుడు వచ్చే పనికి రాని ద్రవ్యాలన్నింటిని, దగ్గరే తవ్విన ఓ బావి నీళ్లలో కలిపేసేవారు. కొంచెం దుర్వాసన తప్పితే మరేం సమస్య ఉండదను కున్నారు. కానీ చుట్టుపక్కల ఉన్న జనాలు బావుల లో నీటి రంగు, రుచి మారిపోయిందని, జనాలు కూడా తరచు ఒంట్లో బాగా లేక హాస్పిటల్స్ కి పోవలసి వస్తున్నదని ప్రెస్ ద్వారా ఫిర్యాదులు చేయటంతో,

పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ వారు పి.ఎల్. ఫ్యాక్టరీల ను తనిఖీ చేశారు. ఆ తనిఖీ తరువాత పి.ఎల్ కు షో కాస్ నోటీస్ ఇచ్చారు. ఓ 10 రోజులకు సరైన సమాధానం రాక పోతే, ఫ్యాక్టరీలు మూసి వేస్తామని బెదిరింపు.

పి.ఎల్ మీర్చందానితో "మీరు రాసిన సమాధానం ఇక్కడ పెట్టేసి వెళ్ళండి. నేను చూసి, నానిర్ణయం మీకు రేపటి లోపల తెలియజేస్తా", అని చెప్పి, మీర్చందాని ని రూమ్ బయటకు పంపించేశాడు.

వెంటనే మహేష్ కి కబురంపాడు. మహేష్ సి.ఎఫ్.ఓ

కాబట్టి పి.ఎల్. రూమ్ కి దగ్గర్లోనే, అదే ఫ్లోర్ లో ఉన్నాడు. పి.ఎల్ రూంలోకి అడుగు పెట్టిన వెంటనే, పి.ఎల్ ముఖం చూసి, మహేష్ ఏదో జఠిలమైన సమస్యనే అనుకున్నాడు.

పి.ఎల్. షో కాస్ నోటీస్, మీర్చందాని దానికి రాసిన నోట్స్ మహేష్ ముందు తోసాడు. పి.ఎల్. వెనుకనున్న గాజు గోడల నుంచి సముద్రం అలలు అవిరామంగా ఇకదాని వెంట ఒకటి రావడం ప్రశాంతంగా కనిపిస్తున్నా, ముందున్న నోటీస్ వల్ల, ఆ అలలను ఉధృతంగా వస్తున్నట్లు ఓ క్షణం అనిపించింది మహేష్ కు.

మహేష్ చదివి, "మీర్చందాని సమాధానంతో, ముగిసే విషయం కాదనుకుంటా", అన్నాడు.

పి.ఏ. నవ్వుతూ, "సరిగ్గా ఊహించావు. మీర్చందానితో పోయేటట్లు ఉంటే, నిన్ను పిలిచే వాడిని కాదు. ఈ షో కాస్ నోటీస్ వెనకాల ఎర్రా సామి హస్తముంది అని తెలిసింది", అన్నాడు పి.ఎల్.

"మీరు చెప్పినట్లు బయప్ప రెడ్డి ఎలక్షన్ కోసం, క్యాష్ చాలా మటుకు మాసిలామణి హవాలా ద్వారా తెప్పించి ఇచ్చినా, కొంత క్యాష్ ఎర్రా సామి ద్వారా కూడా తెప్పించాం కదా. ఆ విధంగా బయప్ప రెడ్డి కి క్యాష్ ఇచ్చి, ఎర్రా సామి హవాల ద్వారా ఆయనకు డాలర్లు అందజేసీ సహాయ పడ్డాం కదా. మరి బయప్ప రెడ్డి, ఎర్రా సామి ఇద్దరిని కవర్ చేసాం, ఇద్దరి నుండి ఎలాంటి సమస్య రాకూడదే", అన్నాడు, మహేష్.

"నిజమే. కానీ సమస్యలు బయప్ప రెడ్డి, ఎర్రా సామి ల మధ్య ఎన్నో ఏళ్ల నుండి ఉంది. అవి తరతరాలుగా వస్తున్న కుటుంబ కక్షలు. వాటికి మనం బలి కాకుండా తప్పించుకోవాలి", నవ్వుతూ అన్నాడు పి.ఎల్. అది మంచి లక్షణం పి.ఎల్. ఎలాంటి సమస్యలు ఉన్నా నవ్వగలడు.

ఆలానే మాటలు పొడిగిస్తూ,"నీకు తెలుసు కదా. పోయిన ఎలెక్షన్లో, బయ్యప్ప రెడ్డి మార్జిన్ బాగా తగ్గిపోయిది. లక్షల ఓట్లు పోల్ అయ్యినా ఎర్రా సామి కంటే ఓ 2 వేల ఓట్ల తేడా తోనే గెలిచాడు. ఆ జిల్లాలో మకుటం లేని మహారాజు గా ఎలుతూ ప్రత్యర్ధి మీద లక్షల ఓట్ల తేడాతో గెలిచే బయప్ప రెడ్డికి ఈ సారి ఎన్నికలలో ఎర్రా సామి ఓ షాక్ ఇచ్చాడు.

జనాలు కూడా ఎవరీ ఎర్రా సామి అని ఓ సారి అనుకుంటున్నారూ, అడుగుతున్నారు. ఈ ఎర్రా సామి, బయప్ప రెడ్డి ని ఇబ్బంది పెట్టాలనే శాసన సభలో ఈ తోలు పరిశ్రమల ప్రస్తావన ప్రవేశ బెట్టి, సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ కు ప్రశ్నలేసాడు. దాని దెబ్బే, ఇలా మన ఫ్యాక్టరీల మీద ఇన్స్పెక్టర్ లు పడడం", అన్నాడు పి.ఎల్.

విషయం అర్ధం అయ్యిన మహేష్ "ఇప్పుడు మనం ఎర్రా సామి తో మాట్లాడాల్సినట్లే ఉంది", అన్నాడు.

పి.ఎల్ "అవును మాట్లాడాలి. అతనికేమి కావాలో కనుక్కొని అది తీర్చాలి. కానీ ఈ పొల్యూషన్ బోర్డ్ తో వచ్చిన సమస్య ఇప్పటితో తీరేది గాదు. రాబోయే కాలంలో మరిన్ని సమస్యలు నాకు కనిపిస్తున్నాయి. వెంటనే ఆ క్రోమేట్ కంపెనీని, తోలు కంపనీ ని అమ్మాకానికి పెట్టేయి. ఎంతకొస్తే అంతకమ్మేయి. ఆ కంపెనీల విలువ మన గ్రూప్ లో 5 శాతం కూడా లేదు",అన్నాడు.

"అలానే సార్. ఎర్రా సామి తో అప్పాయింట్మెంట్ తీసుకొని కలుస్తాను. ఎలాను ఢిల్లీ లో ఆస్ట్రేలియా వీసా కని ఆ ఎంబసీ వాళ్ళు ఇంటర్వ్యూ కి పిలిచారు. రెండు పనులు ముగించుకొని వస్తాను", అన్నాడు మహేష్.

"వచ్చే వారం ఆస్ట్రేలియా పోతున్నావు కదా. గుడ్ లక్. మన ప్రపోసల్ ఆస్ట్రేలియా ప్రభత్వానికి సమర్పిస్తున్నావు కదా. టెండర్ మనమే గెలవాలి. బయ్యప్ప రెడ్డిని కూడా మన తరఫున ఓ రెండు మాటలు మాట్లాడమన్నాను", అన్నాడు పి.ఎల్.

మహేష్ కి ఎర్రా సామితో కలవడానికి సాయంత్రము మాత్రమే టైం దొరికింది. అదీ తను ఉంటున్న అశోక హోటల్ రెస్టారెంట్ లో నే కలుస్తానని చెప్పాడు ఎర్రా సామి.

ఎర్రా సామీ తనతో బాటు ఓ ఇద్దరు అనుచరాలను తీసుకు వచ్చాడు. ముగ్గురూ చూడడానికి సారాయి కాంట్రాక్టర్ల లాగానే ఉన్నారు.

కొంచెం పిచ్చాపాటి తరువాత మహేష్ నేరుగా విషయానికి వచ్చేశాడు.

"మీ హవాలా ను పోయిన ఎలక్షన్ లో పూర్తిగా, ఉపాయిగించుకో లేదు. నెక్స్ట టైం కనీసం మీకు 300 కోట్ల కమిట్ చేస్తాను", అన్నాడు మహేష్.

"వచ్చే ఎలక్షన్ వరకు అగాల? మీరెంత సర్దుబాటు చేయ గలరు అంత ఇప్పుడే చేయండి", వెటకారంగా అన్నాడు ఎర్రా సామి.

"హవాలా ఎందుకు లెండి. మా కెమికల్స్ కంపెనీ కి మంచి లాభాలు వచ్చాయి. బోర్డ్ మీటింగ్ తరువాత ఆ కంపెనీ ప్రతీ ఒక షేర్ కి 5 షేర్లు ఇచ్చేటట్టు స్టాక్ స్ప్లిట్ ప్రపోసల్ పెడతారు. మీరు వెంటనే పి.ఎల్. కెమికల్స్ షేర్లు కావలసినంత కొనండి. స్టాక్ స్ప్లిట్ అయ్యిన వెంటనే మీరు మార్కెట్లో అమ్మేయండి. కనీసం మీకు 50% లాభం వస్తుంది", అన్నాడు మహేష్.

ఎర్రా సామి కి అర్ధం అయ్యిపోయింది. "సరే అలానే చేద్దాం . పి.ఎల్ కి చెప్పు. నేను బయప్ప రెడ్డి కాదని. నా మాటలు, చేతలు రఫ్ గానే ఉంటాయి",

అంటూ ఎదురుగా ఉన్న మెను కార్డ్ లో ఉన్న ఐటెంలు చూడడం మొదలు బెట్టాడు.

"తప్పకుండా. వీలున్నప్పుడు, కొంచెం ఆ పొల్యూషన్ బోర్డ్ వాళ్ళ కో మాట చెప్పండి. మా క్రోమ్ ఫేక్టరీ మీద పడ్డారు", అన్నాడు మహేష్.

– 19 –

సెయింట్ పీట్, ఫ్లోరిడా

ఆగస్టు, 2014

ఫోన్ మ్రోగింది. రాబర్ట్ నుంచి. వస్తుందని అనుకుంటూనే ఉన్నాడు, విశ్వం.

"హలో బాబ్. ఎలా ఉన్నావు", అన్నాడు విశ్వం.

"ఫైన్. నీవూ పనిలో ఉన్నవేమో. క్లుప్తంగా చెప్తాను. రెడ్ రాక్ అకౌంట్లు చూసా. అన్నీ కేసినో అకౌంట్లలాగానే ఉంది. నువ్వు ఆ రెడ్ రాక్ చూసి సగం స్లోట్టింగ్ మెషీన్లు పని చేయటం లేదన్నదే తేడాగా కనిపిస్తున్నది. వాళ్ళు ప్రతి దినం జమ చేస్తున్న క్యాష్ చూస్తే, ఆ హోటల్ 100% కెపాసిటీ పైనే నడుస్తున్నట్లు ఉంది. కాబట్టి ఎవరో ఈ కేసినో ను మనీ లాండేరింగ్ కు ఉపయోగిస్తున్నారన్నదాంట్లో సందేహం లేదు. ఎవరైనా కంప్లైంట్ చేస్తే కానీ బ్యాంక్ ఏ చర్య తీసుకోదు. నాకు ఆ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ కు ఈ విషయం తెలుసునని అనుమానం. మరో విషయం కూడా గమనించాను. కేసినో అకౌంట్లలో నుంచి మూడు నాలుగు వేల డాలర్ల చిల్లర చెక్కులు చాలా ఉన్నాయి. ఎక్కువ చెక్కులు మయామీ లో ఉన్న పోస్ట్ బాక్స్ అడ్రసు లకు పంపించారు. అలానే ఆ బ్యాంక్ బ్రాంచ్ నుండి చాలా క్రెడి కార్డు లు మయామీ అడ్రసు లకు పంప బడ్డాయి. కానీ విచిత్రంగా, ఈ కార్డు నుంచి డబ్బులు ప్రపంచంలో అన్ని నగరాల నుండి తీసుకుటుండగా, ప్రతీ నెల వచ్చే క్రెడిట్ కార్డు బిల్లుల పేమెంట్లు మయామీ లోని బ్యాంక్ ల ద్వారా వస్తున్నాయి", అన్నాడు రాబర్ట్.

విశ్వంకు ఇది మనీ లాండరింగ్, హవాలా వ్యాపారమే అని అర్ధం అయ్యిపోయింది. కానీ బెత్ ఇప్పటికే ఈ పని ఆపమని చెప్పేసింది. బ్యాంక్ లో పని చేస్తున్న వారు ఎక్కువమంది గుఱ్ఱపు కళ్ళకు గంతలు వేసినట్లు కొంత మాత్రమే చూడ గలగడం వల్ల, వారికి ఇదో హవాలా లాగా కనిపించక పోవచ్చు. కానీ ఈ డబ్బు ఒక చోటి నుండి మరో చోటికి మొత్తం ప్రయాణం బ్యాంక్ లో పైన ఉన్న మేనేజిమెంట్ వాళ్లకు తెలిసి ఉండాలి. లేక  కావాలనే అలా మొత్తంగా చూడ కూడదనుకున్నారా. బెత్ తనను వేరే అకౌంట్లు చూడద్దు అన్న దానికి కారణం ఇదేనా? విశ్వంకు సమాధానాలకంటే ప్రశ్నలే ఎక్కువయ్యాయి.

"బాబ్ చాలా థాంక్స్. నీకు అర్ధమైపోయి ఉంటుంది. ఇది మనీ లాండరింగ్ లాగానే ఉందని. నీకు ఈ మయామీ అడ్రస్ లలో కానీ, క్రెడిట్ కార్డు ఊపయోగిస్తున్న తీరులో కానీ, ఏదైనా కామన్ అడ్రస్, పేటర్న్ కనిపిస్తున్నదో, కొంచెం చూసి చెప్ప గలవా", అన్నాడు విశ్వం.

"లెట్ మీ ట్రై అండ్ గెట్ బ్యాక్. కానీ బెత్ తో జాగ్రత్త. నా పేరు బయటకు రానీయకు", అంటూ రాబర్ట్ ఫోన్ పెట్టేసాడు.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

Post your comments